క్లుప్తంగా

ఉన్నత విలువలు నేర్పించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆదోని అర్బన్ : ధనార్జనే ధ్యేయంగా కాకుండా ఉన్నత విలువలతో కూడిన విద్యను నేర్పించాలని ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ సూచించారు.శనివారం స్థానిక భాష్యం పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా డీఎస్పీ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆయనను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

డివైడర్ పనుల పరిశీలన

ఆదోనిటౌన్: పట్టణంలోని నిర్మల్ టాకీస్, డీఎస్పీ బంగ్లా రహదారిలో నిర్మిస్తున్న రోడ్డు డివైడర్ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న మురుగు కాలువ పనులను తనిఖీ చేసి నాణ్యతగా చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులను ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం



పూజలందుకున్న పాపమాంబ జీవసమాధి

ఆదోని అర్బన్ : పట్టణంలోని మరాఠీవీధిలో వెలిసిన శ్రీ పాపమ్మమఠంలో శ్రీ పాపమాంబ 67వ ఆరాధనోత్సవాలు శనివారం మఠం నిర్వాహకులు మాస్కర్ రమేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పాపమాంబకు అభిషేకం, పూజా అర్చన తదితర విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం రథోత్సవం పాపమాంబ మఠం నుంచి వాసవీ కళ్యాణ మండపం వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సేవలకు సత్కారం



సంతోష్‌స్వామికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రైల్వే ఎస్పీ చౌడేశ్వరి

ఆదోని అర్బన్ : వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి శనివారం పురస్కారాలు అందజేశారు. గుంతకల్ పట్టణంలోని శ్రీ సాయిమహిళా డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదోని పట్టణానికి చెందిన సామాజిక సేవా సంస్థ కార్యదర్శి, రక్తదాత సంతోష్‌స్వామికి అవార్డు అందజేసి సత్కరించారు. ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా రైల్వే ఎస్పీ చౌడేశ్వరీ పాల్గొని సమాజ సేవ చేసిన వారికి పురస్కారాలు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ యాదవ్, లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు రంజాన్, హనుమంతు, సభ్యులు గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి

కౌతాళం: ఐదేళ్ల లోపు పిల్లలందరికి టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఏఎన్ఎం శోభ, ఎంపీటీసీ లింగన్న గౌడ తెలిపారు. శనివారం నదిచాగి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో పిల్లలకు టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ గర్భిణులు,0–5 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న పిల్లలకు ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించి టీకాలు వేశారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోండి

కోసిగి:మండలంలో వ్యవసాయ బోరుబావుల కింద పంటలు సాగు చేసుకుంటున్న రైతులు తమ పైర్లను ఈ– క్రాప్ బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయాధికారి రాజు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ వేసవిలో బోరుబావుల కింద సాగుచేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. ఎంపీఈఓ శేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం




ముస్తాబవుతున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

కోసిగి: మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో ప్రభుత్వం నిర్మిస్తున్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభానికి సిద్ధమవుతోంది. వైద్యాధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ సేవలు అందించే దిశగా గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారు. అందులో భాగంగా సజ్జలగుడ్డం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తతే మందు

- నెల రోజులుగా నమోదవుతున్న హెచ్3ఎన్2 కేసులు
- ఐదు నుంచి వారం రోజుల్లో నయమవుతున్న వ్యాధి
- కొందరిలో పది రోజుల వరకు జలుబు, దగ్గు, గొంతు నొప్పి
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు
- చేతుల శుభ్రత, మాస్కు ధరించాలి





ఆదోని అర్బన్ : ప్రజలను వణించిన కోవిడ్ వైరస్ జాడలు పూర్తిగా సమిసిపోయినప్పటికీ ప్రస్తుతం హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ లక్షణాలు పొడ చూపుతున్నాయి. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, ఒంటి నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారిలో కొందరికి పరీక్షలు చేయగా హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌గా నిర్ధారణ అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. ఈ వైరస్ ప్రాణాంతకం కాకపోయినా.. ఎక్కువ రోజులపాటు దాని దుష్ఫలితాలు ఉంటుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ మేరకు పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు ప్రధాన రహదారుల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మాస్కులు అందజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇది ప్రమాదకరమైన వ్యాధి కాదని, అప్రమత్తత పాటు జాగ్రత్తలు తీసుకుంటే రక్షణ పొందవచ్చని చెబుతున్నారు.

లక్షణాలు..

- ఎక్కువ మందికి గొంతు నొప్పితో ప్రారంభమయ్యే జలుబు, జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు లక్షణాలు కనిపిస్తున్నాయి. మరికొంతమందిలో చలి వేయడం, వాంతులు, ముక్కు కారడం, అధిక తుమ్ములు వంటి లక్షణాలు ఉంటున్నాయి.
- జ్వరం మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గిపోతున్నా.. దగ్గు మాత్రం రెండు నుంచి మూడు వారాల పాటు ఉంటుంది.
- చాలా అరుదుగా ఆయాసం వచ్చే అవకాశం.
- పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తితక్కువగా ఉన్నవారిలో అధిక ప్రభావం చూపే అవకాశం ఉంది.
- ఈ లక్షణాలతో ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రైవేట్ ఆస్పత్రులకు కూడా రోగులు వస్తున్నారు.

హెచ్3ఎన్2పై ఆందోళన వద్దు

- హెచ్3ఎన్2 వైరస్ పట్ల ఆందోళన వద్దని వైద్యులు సూచిస్తున్నారు. ముక్కు నుంచి గొంతు మధ్యలోనే ఈ వైరస్ ప్రభావం చూపిస్తుంది.
- కరోనా వైరస్ లాగా ఊపిరితిత్తుల్లో చొచ్చుకుపోయే ప్రభావం దీనికి లేదు.
- వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న అతి కొద్ది మందిలో స్వల్పంగా నిమోనియాకు దారి తీయొచ్చు.
- వైద్యుల సిఫారసుల లేకుండా యాంటీబయోటిక్స్ మందులు వాడరాదు.

ముందు జాగ్రత్తలు పాటించాలి..

- తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి.
- బయటకు వెళ్లే ముందు తప్పనిసరిగా మాస్కు ధరించాలి.
- రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేయి అడ్డం పెట్టుకోవాలి.
- తరచూ శుభ్రమైన నీటిని తాగాలి. జ్వరం, ఒంటి నొప్పులు ఉంటే పారాసిటమాల్ మాత్రలు వేసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయరాదు.

కరోనా నిబంధనలే పాటించాలి



హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాధికి కరోనా నిబంధనలే పాటించాలి. జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు పుష్కలంగా ఉన్నాయి. గ్రామాల్లో వెళ్లే వైద్యులకు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని చెబుతున్నారు. భయపడాల్సి అవసరం లేదు. జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

– సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

అప్రమత్తంగా ఉండాలి



ఏటా సీజన్ మారే సమయంలో జ్వరాలు వస్తుంటాయి. ఈ ఏడాది హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వల్ల జ్వరాలు వస్తున్నాయి. కొందరికీ రెండు వారాల పాటు దగ్గు ఉంటోంది. జలుబు, జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు ఉన్న వారు ఆందోళన చెందకుండా డాక్టర్‌ను వెంటనే సంప్రదించాలి.

– డాక్టర్ ఉషారావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు

వైరస్ తొందరగా వ్యాప్తి చెందుతుంది



ఈ వ్యాధి నార్మల్ ఫ్లూ వంటిది. ఫ్లూ అంటేనే జలుబు, దగ్గు లాంటివి. కరోనాలాగా ప్రమాదం మాత్రం కాదు. అయితే తొందరగా వ్యాప్తి చెందుతుండటంతో ఎక్కువ మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ఇందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇబ్బందిగా అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ కృష్ణమూర్తి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ కమిటీ మెంబర్

పిల్లలు, వృద్ధులలో ఎక్కువగా లక్షణాలు కనిపిస్తాయి



జలుబు, జ్వరం, దగ్గు వంటి లక్షణాలతో పిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఆస్పత్రికి వస్తున్నారు. వారిలో కొందరికి పదిహేను రోజులైనా దగ్గు తగ్గడం లేదని చెబుతున్నారు. అయితే ఎవరికీ సీరియస్ అవ్వడం, ప్రాణాపాయం లాంటి పరిస్థితి లేదు. లక్షణాలు ఉన్న పిల్లలను స్కూల్‌కు పంపకుండా ఉండడం మంచిది.

– డాక్టర్ గోపీనాథ్, ఐఎంఏ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్

ఆంజనేయస్వామికి విశేష పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, అగసలదిన్నెలోని దేవాలయంలో స్వామికి తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. కౌతాళంలోని ఆంజనేయస్వామి, వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో కూడా భక్తులు పూజలు నిర్వహించారు.

శ్రీ మఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక హైకోర్టు జడ్జి శ్రీనివాస్ హరీష్ కుమార్ శనివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనంను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బైక్‌పై నుంచి పడి.. ఇద్దరికి గాయాలు

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఇద్దరికి వ్యక్తులకు గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపిన వివరాల మేరకు..కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన బోయ హనుమప్ప, సిద్దప్ప మాధవరం నుంచి తుంగభద్ర వైపు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూల్‌కు రెఫర్ చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితుడితో పోలీసులు

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి ఏపీలోకి కర్ణాటక మద్యం తీసుకొస్తున్న వ్యక్తిని మాధవరం పోలీసులు నారాయణపురం వద్ద అదుపులోకి తీసుకున్నారు. మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన ఈడిగ మంజునాథ్ ద్విచక్ర వాహనంపై రూ.45 వేలు విలువజేసే 864 కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకొస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనం, మద్యం సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. తుంగభద్ర నదిలో మద్యం తరలింపుపై సమాచారం అందిస్తే వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ హామీనిచ్చారు.





కోసిగి కడాపాళెంలో కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కోసిగిలో అకాల వర్షం

- ఈదురు గాలుల బీభత్సం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు



మంత్రాలయంలో ఈదురుగాలుల తాకిడికి నెలకొరిగిన దుకాణం

కోసిగి : మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులకు స్థానిక కడాపాళెం చౌడేశ్వరి ఆలయ సమీపంలో, దేవరబెట్ట గ్రామ పొలాల్లో చెట్లు విరిగి పడిపోగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. దాదాపు 8 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు స్పందించి రోడ్లకు అడ్డంగా పడిపోయిన చెట్లు, ట్రాన్స్‌ఫార్మర్లనుతొలగించారు. భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పూడిపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే పొలాల్లో ఆరబెట్టిన మిరప, ఉల్లి, వేరుశనగ దిగుబడులు వర్షానికి తడిసి ముద్దాయ్యాయి.

మంత్రాలయంలో ఈదురుగాలులు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం మంత్రాలయంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈదురుగాలులు వీచాయి. భారీ ఉరుములు, మెరుపులతో పాటు కొద్ది సేపు తేలికపాటి వర్షం కురిసింది. దీంతో పలుదుకాణాలకు చెందిన తాత్కాలిక షెడ్డులు నెలకొరిగాయి. పలుచోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శ్రీరంగనాథుడి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

మద్దికెర: మండల పరిధిలోని శ్రీరంగనాథుడి తాత్కాలిక, శాశ్వత హుండీలోని కానుకలను శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 33,66,661 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఏసీ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించడం జరిగిందన్నారు. గతేడాది మార్చి 21 నుంచి నవంబర్ 29 వరకు హుండీ రూ. 12,86,892 అలాగే గతేడాది నవంబర్ 29 నుంచి ఈఏడాది మార్చి 18 వరకు రూ.14, 15,836 చదివింపులు ద్వారా రూ.3,27,098 సేవా టికెట్లు ద్వారా రూ. 2,66,835 ఉభయములు ద్వారా రూ. 70 వేలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగస్వామి, సిబ్బంది రఘు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్రహ్మగుండం హుండీ లెక్కింపు

వెల్దుర్తి: బ్రహ్మగుండం ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. గత ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఈనెల 18 వరకు లెక్కించగా మొత్తం రూ.77,978 సమకూరినట్లు ఆలయ ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి తెలిపారు.

చెరువుల పరిశీలన

తుగ్గలి : బొందిమడుగుల, రాంపల్లి, ఎద్దులదొడ్డి, తుగ్గలి, జొన్నగిరి, మామిల్లకుంట చెరువులను శనివారం డోన్ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ సీహెచ్ పాపారావు పరిశీలించారు. మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి చెరువు కట్టల భద్రతను పరిశీలించారు. రైల్వే సమీపంలో ఉన్న చెరువు కట్టలు ఏమైనా బలహీనంగా ఉంటే రైల్వేట్రాక్‌కు ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. దీంతో ముందస్తుగా చెరువు కట్టల భద్రత పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆయన వెల్లడించారు.

ఆర్బీకేల సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి

ఆదోని రూరల్ : రైతులు ఆర్బీకేల సేవలను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి పి.ఎల్.వరలక్ష్మి తెలిపారు. శనివారం పట్టణంలోని ఆత్మ భవన్‌లో ఎరువులు, పురుగుమందుల విక్రయదారులకు దేశీ కార్యక్రమం నుంచి 48 వారాల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం 48 వారాల పాటు జరుగుతుందని, ఇందులో 40 వారాలు తరగతి శిక్షణ, 8 వారాలు క్షేత్ర శిక్షణ ఉంటుందని చెప్పారు. అనంతరం మండలంలోని ఢణాపురంలోని రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆదోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో వ్యవసాయ శాఖకు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను రైతులతో చర్చించారు. సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, పంటల దిగుబడులు గిట్టుబాటు ధర ఇతర సేవలన్నీ రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను కూడా తనిఖీ చేసి, అజాత గ్రీటెక్‌లో అగ్రిటెక్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను, రికార్డులను పరిశీలించారు. డీపీడీ ఆత్మ శ్రీలత, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఆదోని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.గిరీష్, ఆదోని మండల వ్యవసాయ అధికారి పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ



వసతులు, వైద్యసేవలపై డాక్టర్ లింగన్నను అడిగి తెలుసుకుంటున్న డీసీహెచ్ రామ్‌జీనాయక్

ఆదోని టౌన్ : స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ రామ్‌జీనాయక్ శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, వసతులపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్నను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని పురుషులు, స్త్రీలు, చిన్నపిల్లల వార్డులో పర్యటించారు. డాక్టర్లు సమయానికి వస్తున్నారా... వైద్యసేవలు అందిస్తున్నారా, నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా అని ఆరా తీశారు. డాక్టర్లు ఉన్నప్పటికీ వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని కొందరు రోగులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చిన్నపాటి జబ్బు లేదా ప్రమాదాల్లో గాయపడి వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే ప్రథమ చికిత్స అందిస్తూ కర్నూలుకు రెఫర్ చేస్తున్నారని, మరికొందరు డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేస్తూ స్థానికంగానే ఉన్న తమ నర్సింగ్‌హోమ్‌లకు తరలిస్తున్నారని చెప్పారు. రెఫరల్ కేసులు తగ్గినప్పుడే వైద్యం పూర్తిస్థాయిలో అందినట్లవుతుందని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. సదరమ్ క్యాంపు నిర్వహణ, సర్టిఫికెట్ల జారీపై అనేక ఫిర్యాదులు వస్తుండడంతో ప్రత్యేకంగా విచారణ చేశామని డీసీహెచ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆలూరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుకు రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద మండలంలోని మార్లమడికి గ్రామ రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టాన్నారు. ఆ గ్రామ సమీపంలోని వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేశామన్నారు. సంబంధిత ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసి మైన్స్ అండ్ జియాలజీ అధికారుకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించి, అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు.

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: ఉగాది పండుగను పురస్కరించుకుని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.12,116,రూ.8,116, రూ. 5,116, రూ.3, 116 వేలు చొప్పున బహుమతులు ఇవ్వను న్నట్లు చెప్పారు. పాల్గొనే వారు ఈనెల 19వ తేదీలోపు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 96528 055 68, 95739 65033ను సంప్రదించాలని కోరారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

హొళగుంద: ప్రధానమంత్రి బీమా యోజన పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని హొళగుంద ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణప్రసాద్ కోరారు. గత ఏడాది కోగిలతోటకు చెందిన హనుమంతి అనే పాలసీదారాలు మరణించారు. నామినీ అయిన భర్త గాదిలింగప్పకు రూ.2 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని శనివారం బ్యాంక్ మేనేజర్ అందజేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ వెంకటనారాయణ



నేలతలమర్రి గ్రామంలో జగనన్న గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

ఆలూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్‌పీడీ వెంకటనారాయణ సిబ్బందికి సూచించారు. శనివారం దేవనకొండ మండలం నేల తలమర్రి, దేవనకొండ, కరివేముల తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఏప్రిల్ 5 నాటికి జిల్లాలో 5 లక్షల కుటుంబాలు జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నిర్మాణ పనులను డీఈ, ఏఈలు పర్యవేక్షించాలన్నారు. పీడీ వెంట ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ అనిరుధ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నీకంతేశ్వరనాయుడు, నాగరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి

కృష్ణగిరి: సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయని జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మూల స్తంభంగా సచివాలయ వ్యవస్థ పనిచేయాలన్నారు. గ్రామాల్లో సచివాలయాల సేవలు పెంచాలని, సిబ్బంది పనితీరు కూడా మెరుగుపడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో కీలకపాత్ర వహించాలన్నారు. అలాగే మహిళా కానిస్టేబుల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతోపాటు ప్రతి సచివాలయ ఉద్యోగి తమ విధులు సమర్థవంతంగా నిర్వహించినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. అనంతరం కృష్ణగిరి సచివాలయాలన్ని, నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రామస్వామి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పత్తికొండ డివిజన్ పరిధిలోని మండలాల ఎంపీడీఓలతో జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు, జగనన్న హెల్త్ క్లినిక్‌లతో పాటు పంచాయతీల పరిధిలో జరుగుతున్న అన్ని పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.